ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ 02-09-2025 సమయం 13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంపై జస్టిస్ PC ఘోష్ నివేదికపై తదుపరి విచారణ వరకు ఎలాంటి ప్రతికూల చర్యలు తీసుకోవద్దని హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని ఈ రోజు ఆదేశించింది.

2. రాష్ట్రంలో భారీ వర్షాలు , వరదలతో దెబ్బతిన్న ప్రదేశాల్లో సహాయక చర్యలు , పునరుద్ధరణ పనులను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు.

3. తెలంగాణను గ్లోబల్ స్పోర్ట్స్ హబ్‌గా మార్చి , క్రీడాకారులకు ప్రపంచ స్థాయి సౌకర్యాలు కల్పించడానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు.

4. రాష్ట్రంలో ఈరోజు, రేపు పలు జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ఆరెంజ్ హెచ్చరిక జారీ చేసింది.

**కాళేశ్వరం-హైకోర్టు:**

కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంపై జస్టిస్ PC ఘోష్ నివేదికపై తదుపరి విచారణ వరకు ఎలాంటి ప్రతికూల చర్యలు తీసుకోవద్దని హైకోర్టు ప్రభుత్వాన్ని ఈరోజు ఆదేశించింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ పరేశ్ కుమార్ సింగ్, జాస్తి మొహియుద్దీన్ లతో కూడిన బెంచ్ ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. కాగా, కాళేశ్వరం అంశంపై CBI విచారణకు ఆదేశించాలని ప్రభుత్వం నిర్ణయించిందని, అయితే అది జాతీయ డామ్ సేఫ్టీ అథారిటీ నివేదిక ఆధారంగా నిర్ణయించినట్లు అడ్వొకేట్ జనరల్ కోర్టుకు తెలియజేశారు. ప్రభుత్వ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ బీఆర్ఎస్ నాయకులు దాఖలు చేసిన పిటిషన్లపై విచారణ అక్టోబరు 7కు వాయిదా పడింది.

(MSL)

**వర్షాలు - సీఎం రివ్యూ**

రాష్ట్రంలో భారీ వర్షాలు , వరదల వల్ల దెబ్బతిన్న ప్రాంతాల్లో సహాయక చర్యలు , పునరుద్ధరణ పనులను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. వరదల్లో మరణించిన వారి కుటుంబాలకు , పశువులను కోల్పోయిన రైతులకు తక్షణమే పరిహారం విడుదల చేయాలని సూచించారు. రాష్ట్ర సచివాలయంలో జరిగిన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ ... తీవ్రంగా దెబ్బతిన్న జిల్లాలకు 10 కోట్లు, సాధారణ నష్టం జరిగిన జిల్లాలకు 5 కోట్ల రూపాయల చొప్పున నిధులు విడుదల చేస్తామని ప్రకటించారు. వరదల కారణంగా రాష్ట్ర వ్యాప్తంగా 257 చెరువులు, కుంటలకు గండ్లు పడగా, 82 మండలాల్లో 2.36 లక్షల ఎకరాల్లో పంట నష్టం వాటిల్లినట్లు అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు.

(డెస్క్)

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా-సీఎం టూర్**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని చంద్రుగొండ మండలం బెండలంపాడు గ్రామంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రేపు పర్యటిస్తారు. ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ మహోత్సవంలో పాల్గొంటారు. ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లపై కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. పైలట్ ప్రాజెక్ట్‌గా ఎంపికైన బెండలంపాడులో అధిక సంఖ్యలో ఇళ్ల నిర్మాణాలు పూర్తి కావడం , ముఖ్యమంత్రి స్వయంగా ఈ గ్రామాన్ని సందర్శించడం చారిత్రాత్మకమని కలెక్టర్ పేర్కొన్నారు. (పీటీసీ, భద్రాద్రి కొత్తగూడెం)

**మహబూబాబాద్ రైల్వే స్టేషన్-కిషన్ రెడ్డి**

మహబూబాబాద్ రైల్వే స్టేషన్ ఆధునీకరణ పనులు దాదాపుగా పూర్తయ్యాయని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అమృత్ భారత్ పథకం కింద ఈ స్టేషన్‌ను ఆధునికీకరిస్తోందని , త్వరలోనే ప్రజలకు అందుబాటులోకి వస్తుందని సామాజిక

మాధ్యమం ఎక్స్ లో తెలిపారు. ఈ ప్రాజెక్టు వ్యయం 26.49 కోట్ల రూపాయలు కాగా.. ఇప్పటికే 92 శాతం పనులు పూర్తయ్యాయని తెలియజేశారు.

(డెస్క్)

**కాళేశ్వరం- ఎంపీ డీకే అరుణ**

కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు రెండూ ఒకటేనని , వాటి మధ్య లోపాయికారి ఒప్పందం ఉందని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు, ఎంపీ డీకే అరుణ ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవినీతిపై రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు పూర్తిస్థాయి విచారణ చేపట్టడం లేదని ప్రశ్నించారు. మహబూబ్‌నగర్‌లోని తన కార్యాలయంలో ఈ రోజు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ... కాళేశ్వరంపై ప్రత్యేక కమిషన్ ఇచ్చిన నివేదికలో అనేక అంశాలను దాచిపెట్టడం వెనుక ఉన్న ఉద్దేశం ఏమిటని ఆమె ప్రశ్నించారు.

(పీటీసీ, మహబూబ్ నగర్)

**GDP-రియాక్షన్:**

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసంలో 7.8 శాతం GDP వృద్ధి నమోదు చేయటంతో రానున్న కాలంలో ఈ ధోరణి కొనసాగుతుందని వ్యాపారవేత్తలు ఆశాజనకంగా ఉన్నారు. Federation of Telangana Chambers of Commerce and Industry ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ గరిమెళ్ళ ఆకాశవాణి ప్రతినిధితో మాట్లాడుతూ... ఈ ఏడాది రానున్న కాలంలో కూడా ఈ ధోరణి కొనసాగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

(Soundbyte- శ్రీనివాస్ గరిమెళ్ళ)

---MSL

బ్రేక్

**బతుకమ్మ-జూపల్లి**

ఈ ఏడాది బతుకమ్మ సంబరాలను ప్రపంచం దృష్టిని ఆకర్షించేలా ఘనంగా నిర్వహిస్తామని రాష్ట్ర పర్యాటక , సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. మంత్రులు కొండా సురేఖ, సీతక్కతో కలిసి బతుకమ్మ సంబరాల గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈనెల 21న వరంగల్ వేయి స్తంభాల గుడి వద్ద బతుకమ్మ సంబురాలను ఆరంభించి , 30వ తేదీ వరకు రాష్ట్రం నలుమూలలా అన్ని వర్గాల మహిళలు ఉత్సాహంగా పాల్గొనేలా పర్యాటక , సాంస్కృతిక శాఖలు కార్యాచరణ రూపొందించాయని చెప్పారు.

(డెస్క్)

**క్రీడలు - శ్రీధర్ బాబు**

తెలంగాణను గ్లోబల్ స్పోర్ట్స్ హబ్ గా మార్చేందుకు తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తుందని రాష్ట్ర ఐటీ , పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. అత్యుత్తమ క్రీడాకారులుగా ఎదిగేందుకు అవసరమైన ప్రపంచ స్థాయి సౌకర్యాలను రాష్ట్రంలో అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. రంగారెడ్డి జిల్లా కన్హా శాంతివనంలో 79వ సౌత్ జోన్ ఇంటర్ స్టేట్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ పోటీలను ప్రముఖ కోచ్ పుల్లెల గోపీచంద్ తో కలిసి మంత్రి ఈ ఉదయం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ... జీవితంలో ఎదురయ్యే సవాళ్లను అధిగమించడానికి ఆటలు స్ఫూర్తినిస్తాయన్నారు.

(పీఎన్)

**సిరిసిల్ల-వ్యవసాయ అధికారి**

రైతులు యూరియాకు బదులుగా నానో యూరియాను వాడాలని రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ రూరల్ మండల వ్యవసాయ అధికారి వినీత సూచించారు. వేములవాడలోని రైతు వేదికలో నిర్వహించిన అవగాహన సదస్సులో మాట్లాడుతూ ... నానో ఎరువుల ద్వారా నేల ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చునని చెప్పారు.

(సౌండ్ బైట్ వ్యవసాయ అధికారిణి వినీత)

పిటిసి, రాజన్న సిరిసిల్ల

**వాతావరణం**

రాష్ట్రంలోని పలు జిల్లాల్లో నేడు, రేపు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఈరోజు నిర్మల్ , నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి , ములుగు, భద్రాద్రి కొత్తగూడెం , ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ జిల్లాల్లో అక్కడక్కడ భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఆరెంజ్ హెచ్చరిక జారీ చేసింది.

(డెస్క్)

**మహబూబాబాద్-వర్షాలు**

మహబూబాబాద్ జిల్లాలో నిన్న రాత్రి కురిసిన భారీ వర్షాల కారణంగా పలు వాగులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. దాంతో బయ్యారం - భీమ్లా తండా మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. డోర్నకల్ సమీపంలోని మున్నేరు వాగులోకి భారీగా వరద నీరు చేరింది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

(పీటీసీ, మహబూబాబాద్)

**ఆసిఫాబాద్-ప్రాజెక్టులు**

ఆసిఫాబాద్ జిల్లాలో భారీ వర్షాల కారణంగా కొమురం భీం , వట్టివాగు ప్రాజెక్టులకు వరద పెరిగడంతో అధికారులు గేట్లను ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. కొమురం భీం ప్రాజెక్టు నాలుగు గేట్లను 1.5 మీటర్ల మేర పైకి ఎత్తి 12 వేల 639 క్యూసెక్కుల నీటిని, వట్టివాగు ప్రాజెక్టు రెండు గేట్లను ఎత్తి 3 వేల 800 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు.

(పీటీసీ, ఆదిలాబాద్)

**రైతు సమస్యలు - బీఆర్ఎస్ ధర్నా**

రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సమస్యలను పట్టించుకోవడం లేదని , రైతులకు ఎరువులు అందించడం లేదని మాజీ మంత్రి , బీఆర్ఎస్ నేత శ్రీనివాస్ గౌడ్ విమర్శించారు. గురుకుల పాఠశాలల్లో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై కూడా ప్రభుత్వం దృష్టి పెట్టడం లేదన్నారు. రాష్ట్రంలో ఎరువుల కొరత , రైతుల సమస్యలపై బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ ప్రభుత్వం రైతులను పట్టించుకోకుండా.. రాజకీయ కుట్రలకు పాల్పడుతోందని ఆరోపించారు.

(పీటీసీ, నాగర్ కర్నూల్)

**వరంగల్- కలెక్టర్**

భారీ వర్ష సూచనల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆదేశాలు జారీ చేశారు. వరద సహాయక చర్యలను పకడ్బందీగా చేపట్టాలని అధికారులకు సూచించారు.

(వరంగల్ జిల్లా పి టి సి)

**కేయూ-ఒప్పందం**

విద్యార్థులకు, పరిశోధకులకు నేచురోపతి , యోగా రంగాలలో విస్తృత అవకాశాలు కల్పించే లక్ష్యంతో కాకతీయ విశ్వ విద్యాలయం, అంతర్జాతీయ నేచురోపతి గ్రంథాలయం , పరిశోధన కేంద్రం మధ్య ఒక అవగాహన ఒప్పందం కుదిరింది. కేయూ ఉపకులపతి ఆచార్య ప్రతాపరెడ్డి సమక్షంలో ఈ ఒప్పందంపై కేయూ రిజిస్ట్రార్ ఆచార్య రామచంద్రం , అంతర్జాతీయ నేచురోపతి గ్రంథాలయ నిర్వాహకులు విశ్రాంత ఆచార్యులు గజ్జల రామేశ్వరం సంతకాలు చేశారు.

(పీటీసీ, వరంగల్)